


# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

**MARCH - 2018**

సంవత్సర చందా రూ. 50/-

## టి.వి. ద్వారా క్రీస్తు సంఘముల సువార్త పరిచర్యలు

### సత్యవాణి

| | | |
|---|---|---|
| ఆదివారం సాయంత్రం | : | 6.00 గంటలకు శుభవార్త |
| బుధవారం సాయంత్రం | : | 6.30 గంటలకు రక్షణ |
| గురువారం మధ్యాహ్నం | : | 2.30 గంటలకు రక్షణ |
| ప్రతిరోజు ఉదయం | : | 7.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రతిరోజు మధ్యాహ్నం | : | 3.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రసంగీకులు | : | జాషువా గూటం |
| | | రిక్కీ గూటం |
| | | రోనీ గూటం |

**Youtube లో satyavanichurchofchrist.com**

పై కార్యక్రమములను చూడండి

మీ బంధుమిత్రులను కూడా ప్రోత్సహించండి.

ఉచిత బైబిలు కోర్సు కొరకు మాకు ఈరోజే వ్రాయండి


**SATYA VANI**

P.O.BOX. 80, KAKINADA

PIN : 533004. Ph : 0884 - 2363722

98489 98547, www.satyavanicoc.com

# సత్యవాక్కు

THE WORD OF TRUTH

P.O. Box - 80, Kakinada, A.P. 533 001.

Ph : 0884-2363722 Cell : 98489 98547

Editor

JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి - 39 మార్చి - 2018 సంచిక -8


## వాక్యములో వర్ణించబడిన దేవుని ప్రేమ

## ( The Love of God Described in - 1Cor 13 )

1 కొరింథీ 13:4-8లో అపో. పౌలు నిర్వచించిన దేవుని ప్రేమను గూర్చి ఇప్పుడు తెలిసి కొందాము. ఈ లేఖనభాగము యొక్క విశ్లేషణ వలన ప్రేమయైయున్న దేవుని గ్రహించుకొనుటకు మనకు వీలవుతాది. "ప్రేమ దీర్ఘకాలము సహించును, దయచూపును. ప్రేమ మత్సరపడదు, ప్రేమడంబముగా ప్రవర్తింపదు; అది ఉప్పొంగదు, అమర్యాదగా నడువదు, స్వప్రయోజనమును విచారించుకొనదు, త్వరగా కోపపడదు, అపకారమును మనస్సులో ఉంచుకొనదు. దుర్నీతివిషయమై సంతోషపడక సత్యమునందు సంతోషించును. అన్నిటికి తాళుకొనును, అన్నిటిని నమ్మును, అన్నిటిని నిరీక్షించును, అన్నిటిని ఓర్చును. ప్రేమ శాశ్వతకాలముండును".

**ప్రేమ సహించును :**

ప్రేమ యొక్క లక్షణములను ఒక్కొక్కదానిని పరీక్షింతము. ప్రేమ సహించునను వాస్తవాన్ని అందరు ఎరిగియున్నదే. తల్లిబిడ్డలకు జన్మనిచ్చుటలో సహించుకొంటాది.

వారిని పెంచుటలో పోషించుటలో సహించుకొంటాది. ప్రియురాలు తన ప్రేమికుని కొరకు సహించుకొంటాది. క్రీస్తుద్వారా దేవుడు మన కొరకు సహించుకొన్నారు. "క్రీస్తుకూడ మీ కొరకు బాధపడి మీరు తన అడుగు జాడలయందు నడుచుకొనునట్లు మీకు మాదిరి యుంచిపోయెను" (1పేతురు 2:21). ప్రేమ సహించుటయేకాదు, ప్రేమ దీర్ఘకాలము సహించునని అపొ.పౌలు చెప్పాడు. "యెహోవా దీర్ఘశాంతుడని" సంఖ్యా 14:18 చెప్పు చున్నది. ''యెహోవా దయా దాక్షిణ్యపూర్ణుడు, దీర్ఘశాంతుడు, కృపా సమృద్ధిగలవాడు. మన పాపములను బట్టి మనకు ప్రతిఫలమియ్యలేదు" అని కీర్తన 103:8-10 చెప్పుచున్నది. దేవుడు మనలను ప్రేమించుచున్నారు గనుక మనము పాపము చేసినప్పుడు ఆయన బాధనొందును. అయినను ఆయన దీర్ఘశాంతుడు, కృపాసమృద్ధి గలవాడు. రూతు యెడల బోయజు దయచూపించాడు. ఆమె పరగ ఏరుకొనునప్పుడు ఆమె కొరకు పిడికెళ్లు వేయుడని తన పరివారితో అతడు చెప్పాడు. బాలుడైన మోషే యొక్క ఏడ్పును బట్టి ఫరోకుమార్తె అతనిపై జాలిగొనెను. అయితే ఈ లోకంలో యున్న జాలిగలవారందరికంటె దేవుడు చాల జాలిగలవారు.

### ప్రేమ దయ చూపించును

ప్రేమ మత్సర పడదు. యితరుల యెడల కుళ్లుకోదు. దేవుడు ఎవరి యెడల మత్సరపడరు. ఈర్ష్య చూపించరు. ఆయనను అసహ్యించు కొనువారిని సయితము ఆయన ప్రేమించును. దేవుడు లేడని వాదించు వారిని సయితము ఆయన ప్రేమించును, వారి యెడల జాలిగొనును.

### ప్రేమ సాత్వికము గలది

ప్రేమ ఉప్పొంగదు, అమర్యాదగా నడువదు. మనం ప్రార్థించునప్పుడు గాని, ధర్మము చేయు నప్పుడు గాని మనముందర బూర ఊదింపకూడదు. ఉపవాసము ఉంటే

మనుష్యులకు గాక, దేవునికి అది కనబడాలి. మంచిని జరిగించుటకు ప్రేమ బయలు దేరినప్పుడు అది డంబముగా ప్రవర్తింపదు, ఉప్పొంగదు, సాత్వికముతో పనిచేయును. క్రీస్తు యొక్క మరణములో దేవుడు తన్ను తాను తగ్గించుకొని ఆయునను విడిపించుటకు తన శక్తిని ప్రదర్శించ లేదు ఏలయనగా ఆయన మనలను ప్రేమించారు. యిది ప్రేమయై యున్న దేవుని నిజ లక్షణము.

### ప్రేమ కొనసాగుచు యుండును

ప్రేమ అమర్యాదగా నడువదు. అంటే అది ఎల్లవేళలా వినయము, విధేయత కలిగియుండును. మర్యాదగా ప్రవర్తించును. ప్రేమించు మనుష్యుని యొక్క ప్రాథమిక లక్షణం యిది. ప్రేమించు మనుష్యుడు అన్నిటిని ప్రేమించును. ప్రకృతిని, పశువులను, పక్షులను, మానవుని ప్రేమించును. అందువలన అందరు అతని ప్రేమిస్తారు. దేవుడు తన సృష్టినంతటిని ప్రేమిస్తు దాని యందు ఆనందిస్తారు. "లోకము యెహోవా కృపతో నిండి యున్నది" యని కీర్తన 33:5 చెప్పు చున్నది.

### ప్రేమ నిస్వార్థమైనది

ప్రేమ స్వప్రయోజనమును విచారించుకొనదు. మనం ఆయన శిష్యులుగా యుండగోరితే ప్రతిదినము "తన్నుతాను ఉపేక్షించుకొనవలెనని" క్రీస్తు బోధించారు. స్వార్థపరులను, అహంకారులను ఎవరు ప్రేమించరు, సరిగదా ద్వేషిస్తారు. యితరులను గూర్చి ఆలోచిస్తు వారికొరకు కృషి చేయువారిని నిజముగా ప్రేమిస్తారు. దూతలతోను, భక్తులతోను ఆరాధింప బడునిమిత్తము దేవుడు స్వార్థపరుడై పరలోకమునకే పరిమితి కాలేదు. ఆయన ఈ లోకమును మానవుని సృజించి, మానవునిలో తనదైన దైవిక భాగాన్ని కొంత ఉంచారు. మనం ఆయనను వెదకికనుగొనునట్లు అట్లు చేసారు. ఆయన మనలో ఎవనికిని దూరముగా ఉండువాడు కాడు. మనమాయన యందు బ్రదుకు

చున్నాము, చలించుచున్నాము, ఉనికిని కలిగియున్నాము. అందువలన దేవుడు సరదాగా తన సింహాసనము మీదనే కూర్చుని యుండలేదు గాని ఆయన మనందరిని గూర్చి చింతించుచు మనహృదయ కోరికలను, తలంపులను ఎరిగియున్నారు. జీవగ్రంథములో మనందరి క్రియల రికార్డును ఆయన భద్రపరచుచున్నారు. పరలోకములో మనం ఆయనను సేవించుచు ఆయన ముఖదర్శనము చేతుమని ప్రకటన 22:3 చెప్పుచున్నది. గనుక పరలోకములో కూడ మనం యితరుల కొరకు పని చేయుచుందుము. గనుక "ప్రభువా, నా కొరకు కాదు గాని యితరుల కొరకు నీవలే జీవించుటకు నాకు సహాయము చేయుమని" మనం అనుదినము ప్రార్థించాలి.

### ప్రేమ త్వరగా కోపపడదు

ప్రేమ త్వరగా కోపపడదు అంటే ప్రేమ అసలు కోపపడదని కాదు, ప్రేమ కోపపడును గాని, త్వరగా కోపపడదు. దేవుని ప్రేమ చాల గొప్పది. ఆయన దీర్ఘశాంతుడు, దయగలవాడు. అయినను, అన్యదేవతలకు ధూపార్పణము చేయు "మీ చేతి క్రియలచేత నాకు కోపము పుట్టించుచున్నారు" అని యిర్మియా 44:8లో ఆయన చెప్పుచున్నారు. "ప్రతి మనుష్యుడు కోపించుటకు నిదానించు వాడునై యుండవలెనని" యాకోబు 1:19 చెప్పుచున్నది. మరియు "సూర్యడస్తమించు వరకు మీ కోపము నిలిచి యుండరాదని" ఎఫెసీ 4:26 చెప్పుచున్నది. దేవుడు దీనిని మన నుండి కోరుచున్నట్లయితే కోపించుటకు ఆయన మరింత నిదానించువాడై యుండవలెను గదా.

### అన్నింటిలోను ప్రేమ మంచినే కనుగొనును

ప్రేమ అపకారమును మనస్సులో ఉంచుకొనదు. ప్రేమించు వారు అందరిలోను ఏదోకొంత మంచిని చూస్తారు. దుర్మార్గులు అన్నిటిలోను, అందరిలోను దుర్మార్గతనే చూస్తారు. మనుష్యులందరు చెడ్డ వారే

యని కొందరు అనుకొంటారు గాని "దేవుడు తాను చేసినది యావత్తును చూచినప్పుడు అది చాలమంచిదిగ యుండెను" అని ఆదికాండము 1:31 చెప్పుచున్నది.

## సత్యము నందు సంతోషించును

ప్రేమ దుర్నీతి విషయమై సంతోషపడక, సత్యము నందు సంతోషించును. మొదటిగా సత్యము సంతోషించుననుసంగతిని మనం గమనించాలి. ప్రేమించువారు నిజంగా సంతోషభరితులు. అన్నిటికంటె గొప్పదైన దేవుని ప్రేమను బట్టి దూతలు, పరిశుద్ధులు ఆయన యెదుట సాగిలపడి స్తోత్రగానము చేతురు. ఎందువలన? వారు సంతోషముగా యున్నందువలన. ఒక్కొసారి పాపములో యున్నవాడు సంతోషించు చున్నట్లగుపడును. పాపములో కొంత ఆనందమున్నది. అయితే పాపభోగము అల్పకాలమేయని హెబ్రీ 11:25 చెప్పుచున్నది. పాపములో స్వల్ప ఆనందమున్నను, క్రైస్తవుడు దానిని నిరాకరించును. యేసును వెంబడించు వాడు అను దినము తన్ను తాను ఉపేక్షించు కోవాలని ఆయన చెప్పారు (లూకా 9:23). "క్రీస్తుయేసు సంబంధులు శరీరమును దాని యిచ్ఛలతోను దురాశలతోను సిలువ వేసియున్నారని" గలతీ 5:24 చెప్పు చున్నది. చెడ్డదానిని అసహ్యించు కొనుటకు క్రైస్తవుడు ఎల్లవేళల నేర్చు కొనును (రోమా 12:9). గనుక నిజక్రైస్తవునికి దుర్నీతి యందును, పాపము నందును యేమీ సంతోషము లేదు. గాని అతడు సత్యము నందు సంతోషించును. క్రైస్తవుడు చెప్పన శక్యమును, మహిమా యుక్తమునైన సంతోషము గలవాడైయున్నాడని 1 పేతురు 1:8 చెప్పుచున్నది. "నీ సన్నిధిని సంపూర్ణసంతోషము కలదు. నీ కుడిచేతిలో నిత్యము సుఖములు కలవు" అని కీర్తనలు 16:11లో వ్రాయబడియున్నది. ఈలోకంలో మన జీవితం అంతమయిన తరువాత మనం దేవుని యొక్క సంతోషములో

ప్రవేశిస్తామని మత్తయి 25:21 చెప్పుచున్నది.

ప్రేమ యొక్క అత్యున్నత స్థితిని చెబుతు పౌలు, "ప్రేమ అన్నిటిని తాళు కొనును, అన్నిటిని నమ్మును, అన్నిటిని నిరీక్షించును, అన్నిటిని ఓర్చును" అని చెప్పాడు (1కొరింథీ 13:7).

### అన్నిటికి తాళుకొనును

దేవుడు మోషే ద్వారా ఇశ్రాయేలీయులను ఐగుప్తు బానిసత్వము నుండి విడిపించి బయటకు తీసికొని వచ్చినప్పుడు వారు పాపము చేసారు, ఐగుప్తుకు తిరిగి వెళ్లిపోదలచారు విగ్రహాముల నారాధించారు, సణిగారు, కానాను దేశమును వారు జయిస్తామని నమ్మ లేదు. అయినను పాలిచ్చి పెంచెడు తండ్రి పసిపిల్లలను మోయునట్లు దేవుడు వారిని తన రొమ్మున మోసారు (సంఖ్యా 11:12). "నిశ్చయముగా ఆయన మన రోగములను భరించెను, మన వ్యసనములను వహించెను" (యెషయా 53:4). "క్రీస్తు అనేకుల పాపములను భరించుటకు ఒక్కసారే అప్పగింపబడెనని" హెబ్రీ 9:28 చెప్పుచున్నది. మనము ఒకని భారములను ఒకడు భరించి యీలాగు క్రీస్తు నియమమును పూర్తిగా నెరవేర్చ బాధ్యులమై యున్నాము (గలతీ 6:2).

### అన్నిటిని నమ్మును

ప్రేమ భరించడమేకాదు, అది అన్నిటిని నమ్మును. యిది దేవుని యొక్క యదార్థతను బైబిలు సూచించు చున్నది. "నా దేవుడైన యెహోవా నీతో కూడ నుండును. ఆయన నిన్ను ఎంత మాత్రమును విడువక యుండును" అని 1దినవృ 28:20 చెప్పుచున్నది. 'ప్రభువు తన భక్తులను విడువడు, వారెన్నటెన్నటికిని కాపాడబడుదురు" అని కీర్తన 37:28 చెప్పుచున్నది. ప్రభువు మన యందు నమ్మిక కలిగి యున్నారు. మరియు ప్రేమ ద్వారా ఆయన మనలను విమోచించెదనని ఎరిగియున్నారు. దేవుని ప్రేమించు వారికి మేలుకలుగుటకై సమస్తము

సమకూడి జరుగునని రోమా 8:28 చెప్పుచున్నది.

**అన్నిటిని సహించును**

ప్రేమ నిరీక్షించును, అన్నిటిని సహించును. దేవుని కృపనిత్యము వుండును (కీర్తన 52:11). "యెహోవా దయాళుడు అయన కృపనిత్యముండును. ఆయన సత్యము తరతరములుండును" అని కీర్తన 100:5లో చెప్పబడినది. క్రీస్తు తన యెదుట ఉంచబడిన ఆనందము కొరకై అవమానమును నిర్లక్ష్యపెట్టి సిలువను సహించి దేవుని సింహాసనము యొక్క కుడి పార్శ్వమున ఆసీనుడై యున్నాడు" (హెబ్రీ 12:2).

**ప్రేమ శాశ్వత కాలముండును**

ప్రేమ యొక్క శిఖరాగ్రముగా ప్రేమ శాశ్వత కాలముండునని అపో. పౌలు చెప్పాడు (1 కొరింథీ 13:8). ఈ లోకారంభము నుండి దేవుడు మానవుని ప్రేమించారు, నిత్యము ఆయన ప్రేమించుచుయుంటారు. మనము దాని లోతును కొలువలేము గాని ఆయనకు ఎంతో కృతజ్ఞత కలిగి యుండాలి. దేవుని ప్రేమ ఎన్నడు ఎడబాయలేదు, ఎన్నడు ఎడబాయదు. ఆయన గొప్ప ప్రేమనుబట్టి మనలను విమోచించెదనని ఆది నుండియు దేవుడు ఎరిగియున్నారు.

పాపియైన మానవుడు తన ఆత్మ యొక్క సేదను తీర్చుకొనుటకు దేవుని ప్రేమ గొప్ప నీటి ఊటగా యున్నది. శ్రమలలో ఆయన ప్రేమ మనకు ఆశ్రయ దుర్గమైయున్నది. శోధనలలో అది మనకు ఆశా కిరణమై యున్నది. మరణంలో మధురమైన నిర్ధారణయై యున్నది. పరలోకంలో దానిని పూర్తిగా గ్రహించు కొందుము. అది విమోచింప బడిన వారికి నిత్య ఆనందగానము. ఆశ్చర్యకరమైన తన గొప్పప్రేమకు దేవునికి స్తోత్రములు! దేవుడు ప్రేమయై యున్నారు!!

– ఓటిస్ గేట్వుడ

# యోహాను 3:16

## (John 3 : 16)

"దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వాని యందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను'' (యోహాను 3:16) అను ఈ వాక్యమును బైబిలు నెరిగిన ప్రతి వారును ఎరిగినదే. ఒకని పాపములు క్రీస్తు రక్తము వలన కడుగ బడవలె నంటే అతడు క్రీస్తునామమును బాప్తిస్మము పొందవలెనని సువార్తికులు బోధించుచున్నప్పుడు కొందరు, అట్లయితే యోహాను 3:16 సంగతి యేమి? అని ప్రశ్నింతురు. రక్షణ పొందుటకు బాప్తిస్మము కోరుచున్న మార్కు 16:16, అపో.కా. 2:38లకు యోహాను 3:16 ఏమియు వ్యతిరేకము గా లేదు.

**రక్షణ సంకల్ప సారాంశము :**

యోహాను 3:16లో బాప్తిస్మమును గూర్చి ఏమియు చెప్పబడలేనందున బాప్తిస్మము అవసరము కాదని నీవు తలంచవద్దు. రక్షణ సంకల్పము యొక్క సారాంశము యోహాను 3:16లో చెప్పబడినది. విశ్వాసముంచు ప్రతివాడు నిత్యజీవము పొందునట్లు దేవుడు తన ఏకైక కుమారుని అనుగ్రహించెననుటలో దేవుడు చేసిన ఒకే ఒక్క క్రియగాక, నశించిపోవుచున్న వారియెడల తండ్రి యైన దేవుడు, కుమారుడైన క్రీస్తు చేసినదంతయు మనకు క్లుప్తముగా కన్పడుచున్నది.

"ఆయనను అను గ్రహించెను' అను మాటలో పాపులను రక్షించుటకు క్రీస్తు పొందిన శ్రమలు, బాధలు, చేసిన క్రియలన్నియు అందులో ఇమడ్చబడి యున్నది. 'ఆయన యందు విశ్వాస ముంచు ప్రతి వాడును' అను మాటలలో రక్షింపబడు టకు పాపియైనవాడు చేయవలసిన వన్నియు ఇమడ్చబడి యున్నవి. అంతే కాదు ఒకడు క్రైస్తవ జీవితమును నమ్మకముగా జీవించుటలో దేవుడు కోరు ప్రతి నియమము అందులో ఇమడ్చబడి యున్నది.

పెంతెకోస్తు పండుగ దినమున మొట్టమొదటిగా అపో. పేతురు సువార్తను బోధించెను. ఆనాడు ప్రజలు సువార్తను వినిరి, విశ్వసించిరి, తమ పాపముల విషయమై మారుమనస్సు నొందిరి, తమ పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందిరి. క్రీస్తు ద్వారా ఆయన సంఘ ములో చేర్చబడి, అపొస్తులుల బోధ యందును, సహవాస మందును, రొట్టె విరుచుట యందును, ప్రార్ధన చేయుట యందును ఎడతెగక యుండిరి (అపొ.కా. 2: 36-42). ఇదంతయు చేయు చుండగా వారు 'విశ్వ సించినవారు' అని అపొ.కా. 2:44లో చెప్పబడిరి. నిజమే విశ్వసించిన వారు రక్షింపబడుదురు. అయితే ఎట్టివారు? విధేయత చూపించు విశ్వాసులే రక్షింప బడుదురు. మిత్రుడా! నీవు క్రీస్తునందు విశ్వాసివా? అయితే నీవు ఏరకమైన విశ్వాసివి? నీవు సువార్తకు లోబడితివా? లేనియెడల సువార్తకు విధేయులు కానివారికి ప్రభువైన యేసు ప్రతి దండన చేయును సుమా (2థెస్స 1:8).

అపో.కా. 2:44లో చెప్పబడిన విశ్వాసులు తమ పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందినవారు. వారు బాప్తిస్మము పొందగా ప్రభువే వారిని తన సంఘముతో చేర్చుకొనెను (అపొ.కా. 2:38,47). గనుక యోహాను 3:16లో చెప్పబడిన రీతిగ విశ్వసించుట యనగా సువార్తకు లోబడుట యని యర్ధము.

అంతేకాకుండ యోహాను 3:16లో చెప్పబడిన రీతిగ ఒకడు విశ్వసించిన యెడల అతడు క్రీస్తు స్థాపించిన సంఘసభ్యుడగును. ఆ సంఘమును ఆయన పునరుత్థానుడైన తరువాత మొదటి పెంతెకోస్తు దినమున స్థాపించెను. యేసు స్థాపించిన సంఘములో లేకుండ యోహాను 3:16లో చెప్పబడిన రీతిగ యెవడును రక్షింపబడజాలడు. క్రొత్త నిబంధనను మనము బాగుగా చదివిన యెడల ఒకడు దేనివలన రక్షింపబడు చున్నాడో దాని వలననే అతడు క్రీస్తు సంఘ సభ్యుడగుచున్నట్లు గమనించ గలము.

### క్రీస్తు సంఘము డినామినేషన్ కాదు

క్రీస్తు స్థాపించిన సంఘము ఒక డినామినేషన్ కాదు. అది అనేక డినామినేషన్ల కలయిక కూడ కాదు. అది ఒక శాఖకాదు. క్రీస్తు ఒకే ఒక్క సంఘమును స్థాపించెను. దానిలో చీలికలను పరిశుద్ధాత్ముడు ఖండిచెను (1 కొరింధి 1:10). ఎవరైనను ఈనాడు డినామినేషన్లలో యున్నారంటే వారు యెహోహాను 3:16లోని విశ్వాసమును కలిగియుండలేదని మనము గ్రహించుకొనగలము.

బైబిలులో మనకు కన్పించు సంఘమే దేవుని గృహమై యున్నది. దానిలో చీలికల వలన దేవుడు సంతోషించరు. క్రీస్తు నీ రక్షకుడని నీవెట్ల గ్రహించుకొనగలవో అట్లే నీవు క్రీస్తు సంఘస్థుడవో కావో తెలిసికొన గలవు. క్రీస్తు రక్షకుడెట్లాయెనో బైబిలు బోధించు దానిని బట్టి నీవు గ్రహించు కొనగలవు. ఒకడు క్రీస్తు సంఘము లోనికి ఎట్లు ప్రవేశింప గలడని బైబిలు బోధించుచున్నదో దానిని బట్టి నీవాయన సంఘములో యున్నావో లేవో గ్రహించుకొన వచ్చును.

### విశ్వాసము ఒక్కటే చాలదు

యేసుక్రీస్తు నందు విశ్వాస ముంచిన మాత్రముననే రక్షింపబడి పోతినని నీవు తలంచవద్దు. యోహాను 3:16 అట్లు చెప్పుటలేదు. నిజమే, విశ్వసించినవాడు రక్షింపబడునని అది బోధించుచున్నది. అయితే విశ్వసించిన వాడు ఎప్పుడు రక్షించబడును? అతని విశ్వాసము దేవుని ఆజ్ఞలకు విధేయత చూపించుటకు నడిపించిన యెడల అప్పుడతడు రక్షించబడును. ఏల యనగా ప్రాణములేని శరీర మేలాగు మృతమో, క్రియలు లేని విశ్వాసము అలాగే మృతము (యాకోబు 2:14-26). ఒకడు విశ్వాస మూలమున రక్షింపబడును. గాని విశ్వాసము మాత్రము వలననే కాదు. ఒకడు తన పాపముల విషయమై మారుమనస్సు పొందనిదే రక్షించబడలేడు. (అపో.కా. 17:30). అతడు తన పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందనిదే విశ్వసించిన మాత్రమున రక్షింపబడ జాలడు (అపో.కా. 2:38, రోమా 6:3).

యెహోహాను 3:16లోని

విశ్వాసము యేసే దేవుని అద్వితీయ కుమారుడని నమ్మునట్టి విశ్వాసము. ఆయనను దేవుడు మృతులలో నుండి లేపెనని నమ్మునట్టి విశ్వాసము. యేసు ఒక సత్పురుషుడే గాని దేవుని కుమారుడు కాదని కొందరు వాదించు చుందురు. క్రీస్తునందు అట్టి విశ్వాసము గలవారి విశ్వాసము వ్యర్థమైనది. "నేను ఆయనను (అనగా దేవుని కుమారుని) అని మీరు నమ్మని యెడల మీరు మీ పాపములలోనే మరణింతురు" అని అందుకు యేసు చెప్పెను (యోహాను 8:24).

యేసు ఒక సత్పురుషుడని, అనేక మత గురువులలో ఆయన ఒకడని నీవు నమ్ముచున్న యెడల అట్టి విశ్వాసము నిన్ను రక్షించదు. నీ పాపముల నుండి విముక్తి పొందుటకు ఆయనే దేవుని కుమారుడని, ఆయన తప్ప వేరొక రక్షకుడు లేడని నీవు విశ్వసించవలెను. "యేసుప్రభువని నీ నోటితో ఒప్పుకొని దేవుడు మృతులలో నుండి ఆయనను లేపెనని నీ హృదయ మందు విశ్వసించిన యెడల నీవు రక్షింపబడుదువు. ఏలయనగా నీతి కలుగునట్లు నోటితో ఒప్పుకొనును" అని దైవ వేదము బోధించుచున్నది (రోమా 10:9,10). మరల "మరి ఎవని వలనను రక్షణ కలుగదు. ఈ నామముననే మనము రక్షణ పొంద వలెను గాని ఆకాశము క్రింద మనుష్య లలో ఈయబడిన మరి ఏ నామమున రక్షణ పొందలేము" అని దేవుని గ్రంధము మనకు విపులముగా బోధించుచున్నది (అపొ.కా. 4:12).

అవును, దేవుడు లోకము నెంతో ప్రేమించెను. ఆయన ప్రేమకు నీవు, నేను పాత్రులము కాకపోయినను ఆయన మనలను ప్రేమించెను. పాపముల నుండి మనలను విడుదల చేయు నిమిత్తము ఆయన యేసుక్రీస్తు ను సిలువపై బలి యిచ్చెను. ఇప్పుడు క్రీస్తు నందు విశ్వసించిన వానిని ఆయన రక్షించును. అయితే ఆయన ఆజ్ఞలకు విధేయత చూపించు విశ్వాసి నే ఆయన రక్షించును గాని అవిధేయుని మాత్రము కాదని గ్రహించుము.

– జాషువా గూటం

# సాత్వీకులు ఎవరు ?

## ( Who are the Meek ? )

యేసుప్రభువు చెప్పిన ధన్యతలలో మానవజాతి యొక్క మంచివర్ణన ఈయబడినదని ఒకరు చెప్పారు. అయితే యేసుప్రభువు వర్ణించిన లక్షణములకు భిన్నముగా మన లక్షణములున్నట్లు అగుపడుచున్నది.

"సాత్వీకులు ధన్యులు, వారు భూలోకమును స్వతంత్రించుకొందురు" అని మత్తయి 5:5లో చెప్పబడినది. నేటి మన సమాజములో సాత్వీకము సద్గుణమని ఎంతమంది నమ్మెదురు? అదొక బలహీన లక్షణముతో సమానమని అనేకులు భావింతురు. అయితే సాత్వీకము బలహీనము కాదు (Meekness is not weakness) గాని అదుపులో యుంచబడిన బలము.

విలియం బార్క్లే అనునతడు ఇట్లు చెప్పాడు : గ్రీకు భాషలో ప్రాస్ (Praus) అనుమాట ప్రత్యేకముగా వాడబడెను. సాదువు చేయబడిన జంతువును గూర్చి అది వాడబడెను. ఒకప్పుడు అదుపులో లేని గుర్రము కళ్లెము వేయబడినందున విధేయత చూపు జంతువాయెను. ప్రాస్ అను మాట యొక్క భావరహస్యము ఇందులో యున్నది. ప్రాస్‌లో మృదుత్వ మున్నది. గాని ఆమృదుత్వము వెనుక ఇనుములాంటి శక్తియున్నది. అట్లే సాత్వికుడైన మనుష్యుని లక్షణమేమిం టంటే అతడు పరిపూర్ణ నిగ్రహశక్తి గలవాడు. అది వెన్నెముక లేని మృదుత్వము కాదు, అది నిగ్రహము చేయబడిన శక్తి.

సాత్వీకము యొక్క కొన్ని ఉదాహరణలు బైబిలు మనకిచ్చు చున్నది. మోషేను ఒక ఉదాహరణగా గమనించుము. అతడు శక్తిమంతుడు అయినను సాత్వీకుడు. తదుపరి అందరి కంటే శక్తిమంతుడైన యేసు ఉన్నారు. అయినను ఆయన అందరికంటే సాత్వీకుడు. నేను సాత్వీకుడనా? అని మనలో ప్రతివాడు ప్రశ్నించుకోవాలి. నాకున్న శక్తి దేవుని అదుపులో యుంచబడిందా? నా జీవితాన్ని దేవుని చిత్తమునకు అప్పగించుచున్నానా? యని ప్రతివాడు ప్రశ్నించుకోవాలి. సాత్వీకము అంటే శక్తి హీనతకాదు.

– గ్రీలీకర్క్‌పేట్రిక్

# సంఘము అంతప్రాముఖ్యమా?

## ( Is the Church Really that Important ? )

మతశాఖల ఆర్గనైజేషన్‌ను, అందున్న దశలవారి అధికారులను చూచి విసికిచెంది కొందరు సంఘము అంత ప్రాముఖ్యము కాదంటారు. గనుక ఎవరి దారి వారిదేయనే ధోరణిని వారు వ్యక్తపరుస్తారు. డినామినేషన్లు అంత ప్రాముఖ్యముకాదు. గాని క్రీస్తు స్థాపించిన సంఘము ప్రాముఖ్యమే. దేవునితో నిజమైన ఆత్మీయ సంబంధము కలిగియుండుటకు క్రీస్తు సంఘములో సభ్యునిగా యుండుట అత్యవుసరము. అది ఒక డినామినేషన్ కాదు. మానవ కల్పిత ఆర్గనైజేషన్ దానికి లేదు. దిగువ సంగతులు గమనించుము.

సంఘము పరలోకములో జన్మించినది గనుక అది చాలా ప్రాముఖ్యము : సంఘాన్ని గూర్చి అనేకులు అది మానవకల్పితమని తలంచి ఉదాసీనతకలిగి యుందురు. అది నిజానికి మానవ కల్పితమే అయితే మనందరము దానిని వ్యతిరేకించాలి. అయితే క్రొత్త నిబంధనలో మనకు కనబడు సంఘము దైవిక మైనది. అది దైవిక ఆరంభమును కలిగి యున్నది. దేవుని నిత్యసంకల్పములో సంఘము ఉండెను. అది క్రీస్తులో నెరవేరెను. "దేవుడు మన ప్రభువైన క్రీస్తుయేసు నందు చేసిన నిత్య సంకల్పము చొప్పున పరలోకములో ప్రధానులకును, అధికారులకును సంఘము ద్వారా తన నానావిధమైన జ్ఞానము ఇప్పుడు తెలియజేయబడ వలెనని ఉద్దేశించెను" (ఎఫెసీ 3:10-11). సంఘము యొక్క ప్రాముఖ్యతను నిర్లక్ష్యము చేయు ఏ ప్రయత్నమైనను, దేవుని రక్షణ సంకల్పము లోపభూయిష్ట మైనదని చెప్పుచున్నట్లగును. సంఘము స్థాపించ బడిన తరువాత రక్షింపబడిన ప్రతి వారు ఆయన ప్రియకుమారుడు స్థాపించిన సంఘముతో చేర్చబడునని సర్వ శక్తిమంతుడైన దేవుడు నిర్ణయించారు (అపొ.కా. 2:47). సంఘము అంత ప్రాముఖ్యము కాదు,

క్రైస్తవ్యానికి అది అడ్డుబండయనుట యెహోవా దేవుని జ్ఞానమును కించ పరచుటయే యగును.

**సంఘము రక్తముచే కొన బడినది గనుక అది ప్రాముఖ్యమైనది:** అది క్రీస్తుకు అంత ప్రాముఖ్యమైన ప్పుడు మనకు ప్రాముఖ్యము కాదని ఎవరు చెప్ప గలరు? యేసును ప్రేమించు చున్నామని ఆయనను వెంబడించు చున్నామని చెప్పుకొనే వారున్నారు. గాని ఆయన దేని కొరకు మరణించారో దానిని మన్ననచేయరు. సంఘమును సంపాదించు నిమిత్తము ఆయన తన రక్తాన్ని చిందించారు (అపొ.కా. 20: 28). యేసు సంఘాన్ని ఎంత ప్రేమించారంటే దాని కొరకు ఆయన తన ప్రాణమర్పించారు. ప్రభువు యొక్క వధువైన సంఘమును మనము చులకన చేయుట తప్పు. మనము క్రీస్తును అనుకరించాలంటే ఆయన తన ప్రాణమర్పించిన సంఘమును ప్రేమించాలి.

**సంఘము మహిమలో ప్రవేశించునది గనుక అది ప్రాముఖ్యము :** యేసు వరుడై యుండగా సంఘము ఆయన యొక్క వధువై యున్నది (ఎఫెసీ 5:22). ఆయన తన ప్రశస్త వధువు కొరకు నిత్య నివాసము ఏర్పరచుటకు వెళ్ళి యున్నారు (యోహాను 14:1-6). ఆ సిద్ధపరచిన స్థలమునకు తన వధువును తీసికొని వెళ్లుటకు ఒకానొకదిన మందు ఆయన తిరిగి వచ్చును. అంతము వచ్చినప్పుడు ఆయన తన రాజ్యమైన సంఘమును తండ్రియైన దేవుని కప్పగించును (1 కొరింథీ 15:24). ఆయన సంఘములో నమ్మకముగా జీవించిన వారందరు తండ్రియైన దేవునితో, కుమారుడైన క్రీస్తుతో, పరిశుద్ధాత్మతో నిత్యము నివసింతురు. మరియు విమోచించ బడిన వారందరితో వారు నిత్యము నివసింతురు. అంత్యదినమందు సంఘమును యేసు తండ్రికి సమర్పించు వాడైతే సంఘము అంత ప్రాముఖ్యము కాదని ఆయన ఎన్నడు తలంచి యుండరు!

-పేట్రిక్ మోరిసన్

# యోబు గ్రంథము నుండి గొప్ప పాఠములు

## ( Great Lessons from the book of Job)

I. మానవులను పట్టుకోడానికి సాతానుడు విశ్వప్రయత్నాలు చేయునని యోబు గ్రంథము బోధించుచున్నది : (యోబు 1:7; 2:2).

1. ఎవని మ్రింగుదునా అని సాతాను వెదుకుచుయున్నాడని పేతురు చెప్పు చున్నాడు (1 పేతురు 5:8).
2. సంఘము అభివృద్ధిజెందకుండా సాతానుడు నానా తంత్రములను వినియోగించునని తానెరిగినట్లు పౌలు చెప్పాడు - (2 కొరింథీ 2:11).
3. అబద్ధబోధకుల ద్వారా సంఘమును నాశనము చేయుటకుగాను అపవాది తోడేళ్లను పంపును. వాడు సంఘ నాయకులను కూడ తన పనికి వాడు కొనును (అపొ.కా. 20:28-31, 2 తిమోతి 4:3-5).
4. తదుపరి క్రైస్తవులు ప్రభువును గాక మనుష్యులను వెంబడించునట్లు అపవాది వారిలో చీలికలు ఏర్ప రచును (1 కొరింథీ 1:10-13).

II. మానవుని వేదాంతము పనికిరాదని యోబు గ్రంథము బోధించు చున్నది (యోబు 16:2,3) .

1. మనుష్యులు తమ మార్గము నేర్పరచు కొనుట వారి వశములో లేదని యిర్మియా చెప్పాడు (యిర్మియా 10:23).
2. సత్క్రియలు చేయునట్లు దేవుని జ్ఞానము మనకు నేర్పును. అది మనలను పరిపూర్ణులుగా చేయును (1 కొరింథీ 2:6-13; 2తిమో 3:16,17).
3. గనుక మానవ జ్ఞానమును విసర్జించాలని పౌలు మనకు బోధించు చున్నాడు (2 కొరింథీ 10:5).

III. దేవుని యందు మనం సంపూర్ణ విశ్వాసము కలిగియుండాలని


**యోబు గ్రంథము బోధించుచున్నది (యోబు 42:1-6).**

1. మనం దేవుని పై ఆధారపడాలని జ్ఞానియైన సొలొమోను మనకు హెచ్చరిక నిచ్చుచున్నాడు (సామెతలు 3:5-7).
2. అట్లే మధుర గాయకుడైన దావీదు మనలను దేవునివైపు నడిపించ యత్నించు చున్నాడు (కీర్తన 33:8-12).
3. అందువలననే "దేవుడు మన పక్షమున నుండుగా మనకు విరోధియెవడు? అనే ప్రశ్నను పౌలు అడుగుచున్నాడు (రోమా 8:31).

IV. **ఈ జీవిత క్లిష్ట సమస్యలన్నీ యేసుక్రీస్తు లో నెరవేరునని యోబు గ్రంథము మనకు గొప్ప పాఠమును నేర్పుచున్నది :**

1. తనకును దేవునికిని మధ్య ఒక మధ్యవర్తియుండాలని యోబు కోరాడు (యోబు 23:3; 9:33).
2. యేసుక్రీస్తు ఆ స్థానమును భర్తీచేయునని మనం ఎరుగుదుము (1తిమోతి 2:5; 1యోహాను 2:1, హెబ్రీ 4:14-16).
3. సమాధి యనంతరం జీవిత ముండునా యని యోబు యోచించాడు (యోబు 14:14).
4. తన బోధద్వారాను, మృత్యుంజయుడై తానేలేచుట ద్వారాను యేసు పునరుత్థానమును రుజువు చేసారు (యోహాను 11:25,26; 1యోహాను 2:1; కొలస్స 3:4).
4. మనందరివలె యోబు తనకొక విశ్రాంతి స్థలము కావాలనుకొన్నాడు (మత్తయి 11:28-3); హెబ్రీ 4:1-11).
5. అది మనందరినీ ఈలోక సాధక బాధకాల నుండి విడిపించునట్టిది (ప్రకటన 21:4-7).

– ధెర్మన్‌హాడ్జ్



# విత్తువాని ఉపమానము

## ( The Parable of the Sower )

**పరిచయము :**

**1. సువార్త విను వారి యొక్క స్పందనను, వారి యొక్క శాతమును ఈ ఉపమానము తెలియ జేయుచున్నది.**

ఎ. సువార్తను వినువారిలో నూటికి 25 మంది దానిని నిరాకరింతురు.

బి. సువార్తను విని అంగీకరించిన వారిలో 25 శాతము త్వరలో దాని నుండి తొలగిపోవుదురు.

సి. సువార్తను వినువారిలో 25 శాతము దానివలన అభివృద్ధి జెందరు, నిష్ఫలులగుదురు.

డి. సువార్తను విన్నవారిలో 25 శాతము వాక్యమును విని, విశ్వసించి, మారుమనస్సు పొంది, బాప్తిస్మము పొంది బహుగా ఫలింతురు.

ఇ. సువార్తను వినువారిలో నూటికి 75 మంది నాశము పాలగుదురు.

ఎఫ్. సువార్తవలన వినిన వారిలో నూటికి 30 మంది సంఘమును విడనాడుదురు.

జి. నమ్మకముగా యున్నామని చెప్పుకొనే వారిలో సగము మంది నశింతురు.

హెచ్. సువార్త వినిన వారిలో నాలుగో వంతు మాత్రమే రక్షణ పొందుదురు.

**2. మనలో ప్రతివాడు ఈ నాలుగు రకములైన వాటిలో ఏదో ఒక నేలకు గురుతుగా యున్నాము.**

ఎ. త్రోవ ప్రక్కను పడినవాడు రా నొల్లడు గనుక వాడు రాలేదు.

బి. రాతినేల మీద పడినవాడు కూడ ఉన్నాడు గాని ఎక్కువ కాలముండడు.

సి. ముండ్లపొదల నడుమ పడినవాడు న్నాడు గాని, అతడు నిష్ఫలుడు. కోతయేమిరాదు.

డి. మంచినేల వాడు ఇక్కడ వున్నాడు. అతనిలో నుండి మంచి ఫలితములు కలుగును.

**3.** బహుకొద్దిమంది మాత్రమే రక్షింపబడినను, పరలోకములో అసంఖ్యాక ప్రజలుందురం

(మత్తయి 7:13, 14; ప్రకటన 7:9).

4. వివిధ నేలలపై ఒకే రకమైన విత్తనము విత్తబడి ఒకే విధమైన ఫలితము నిచ్చుశక్తి గలది (లూకా 8:11).

ఎ. అందు వలన పెంతెకోస్తునాడు పేతురు ప్రసంగించగా మూడు వేలమంది క్రైస్తవులయిరి. గాని 9,97,000మంది క్రైస్తవులు కాకుండా యుండిపోయిరి (అపో. కా. 2:37-41).

బి. స్తెఫను ప్రసంగించగా సువార్త వినిన వారు త్రోవప్రక్కను పోలిన నేలవంటి హృదయము గలవారు. గనుక వారంతా హత్యచేసారు (అపో.కా. 7:544, 58-60).

సి. ఈ రెండు సందర్భములలోను ఒకే రకమైన విత్తనము, అనగా దేవుని వాక్యము విత్తబడినది, గాని నేల మాత్రము భిన్నమైనది.

5. ఈ ఉపమానమును గొప్ప ఉపదేశకుడు యేసుక్రీస్తు బోధించారు. విత్తనమైతే దేవుని వాక్యమే.

ఎ. దేవుని బిడ్డయైన ప్రతివాడు విత్తువాడైయుండవలెను (హెబ్రీ 5:12-14; అపో.కా. 8:4).

బి. ప్రతి విత్తనములోను జీవముండును. ప్రతి విత్తనము దాని జాతి ప్రకారము ఫలమిచ్చును (ఆది.కా. 1:11; గలతీ 6:7).

I. త్రోవ ప్రక్కనున్న నేలను అనగా సాతాను కలిగియున్న నేలను ఆలోచించుము (లూకా8:5,12).

ఎ. ఈ సందర్భములో విత్తనము విత్తబడినను, దానిలో నుండి ఏ విధమైన మొలకరాలేదు.

బి. ఈ హృదయము దేవుని వాక్యమును విశ్వసించలేదు.

సి. దేవుని వాక్య స్థానములో సాతానుడు అబద్ధమును విత్తును (ఆది.కా. 3:4,5; యోహాను 8:44).

డి. సాతానుడు నేడు కూడ చెప్పు కొన్ని అబద్ధములు :

1. నీ కిష్టమొచ్చిన సంఘముతో ఆరాధించుము; క్రీస్తుస్థాపించిన సంఘమే అక్కర్లేదు (మత్తయి 16:18; రోమా 16:16).

2. యేసు తన స్వరక్తమిచ్చి సంఘమును సంపాదించినను

అన్ని సంఘములు మంచివే (అపో.కా. 20:28).

3. క్రీస్తు సంఘములోనే గాక ఎక్కడ వున్నా రక్షింపబడగలము (హెబ్రీ 10:25-31).

ఇ. ఎక్కడ సువార్త కూటము జరిగినా, బైబిలు క్లాసు జరిగినా అపవాది తప్పక హాజరై, వాక్యము విని వారి హృదయములో నుండి దానిని ఎత్తుకొని పోవును (1పేతురు 5:8).

**II. రాతినేలను పడిన విత్తనమును గూర్చి ఆలోచించుము (లూకా 8 : 6,13).**

ఎ. ఈ నేల పై విత్తనము విత్తబడి, క్రమేపి మొలకెత్తుచు వుండును, గాని వేరులోతుగా లేనందున అది ఎండిపోవును.

బి. ఇట్టి హృదయము గలవాడు విని, రక్షింపబడును గాని శోధనలు రాగా తొలగిపోవును.

సి. విశ్వాస భ్రష్టత్వములో సాతాను పాలి భాగస్థుడగును (1పేతరు 5:8).

డి. నశింపోవుట కంటె విశ్వాసము నుండి పడిపోవుట ఘోరమైనది (2 పేతురు 2:20-22).

ఇ. విశ్వాసము కోల్పోవకుండా దేవుని బిడ్డయైన ప్రతివాడు ప్రతి విధమైన దుష్టత్వము నుండి తొలగిపోవాలి. తన్ను తాను సజీవయాగముగా సమర్పించుకోవాలి (1థెస్స 5:22, రోమా 12:1,2).

ఎఫ్. దేవుని బిడ్డ క్రైస్తవ విశ్వాసము నందు వేరు పారి స్థిరపడి యుండాలి (కొలస్స 2:6,7).

జి. సాతాను ఆదిమ దంపతులను, ఇస్కరియోతు యూదాను ఆకర్షించాడు. యోబును గూర్చి తంటాలు పడ్డాడు. అతడు నిన్ను నన్ను వెదకుచున్నాడు. సాతానుడు ఏ ఒక్క కూటమును విడిచిపెట్టడు.

హెచ్. ఎండిపోయిన ద్రాక్షతీగలు పోగు చేయబడి కాల్చివేయబడునని జ్ఞాపకము ముంచుకొనుము (యోహాను 15:6).

**III. ముండ్ల పొదలను పోలిన హృదయము గలవాడు ఐహిక విచారముతోను ధనభోగము తోను అణచి వేయబడినవాడు (లూకా 8 :7,14).**

ఎ. విత్తనము విత్తబడగా అది

మొలకెత్తును.

బి. ఈ రకమైన హృదయము గలవాడు నమ్ముతాడు, రక్షింపబడతాడు గాని నిష్ప్రయోజనకరమైన దానుని హృదయము గలవాడు.

సి. నిష్ప్రయోజనమైన దాసులు పడ వేయబడుదురు (మత్తయి 25:30).

డి. నిష్ఫలమైన ద్రాక్షతీగలు కోసిపార వేయబడును (యోహాను 15:2).

ఇ. అయితే దేవుని వాక్యము క్రైస్తవ్యమును పరిపూర్ణము చేయగలదు (2తిమో 3:16,17; లూకా 8:11).

ఎఫ్. క్రైస్తవులు మొదట ఆత్మీయ సంగతులను వెదుకవలెను (మత్తయి 6:33; యాకోబు 4:4).

జి. ఆత్మీయ సంగతులకు బదులు ఆర్థిక సంగతులపై ఆసక్తి కనుబరిస్తే క్రైస్తవులలో ఆత్మీయ విలువలు కూలబడును (1తిమోతి 6:6-12; మత్తయి 6:24).

IV. మంచినేలను పడిన విత్తనమును, విశ్వాసములో స్థిరముగా యున్న హృదయమును గమనించుము (లూకా 8:8,15).

ఎ. ఈ విత్తనము ఫలించి అభివృద్ధి జెందును.

బి. ఈ హృదయము గలవాడు, విన్నాడు, విశ్వసించాడు, రక్షించ బడ్డాడు, అభివృద్ధిజెందుతాడు. ఆత్మీయఫలములను ఫలిస్తాడు.

సి. ఇట్టి హృదయముగల కొద్ది మందే పరలోకమునకు వెళు దురు (మత్తయి 7:21-23).

డి. మొట్టమొదటి సువార్త ప్రసంగము చేయబడగా పది లక్షలమందిలో మూడువేలు మంది మాత్రమే రక్షించబడ్డారు.

ఇ. ఇట్టిది యోగ్యమైన మంచి హృదయమని యేసు చెప్పారు (లూకా 8:15).

ముగింపు :

1. ఈ ఉపమానములో నీవు, నేను కూడా యున్నాము.
2. సాతానుడు నలుగురిలో ముగ్గురుని తన కొరకు జయిస్తాడు.
3. మంచిహృదయము గలవాడు రక్షణ నిమిత్తము అన్నిటిని సహించును.

-లూయిస్ రష్మోర్

# సంక్షిప్త వార్తలు

2018 ఫిబ్రవరి నెల అంతయు ఆయా ప్రాంతములలో సువార్తకూటములతోను, బైబిలు క్లాసులు నిర్వహించుటతోను గడిచెను. ఫిబ్రవరి 1–2 వారములలో రిక్కీ గూటం గారు అన్నవరం, తుని, నర్సీపట్నం, సరుగుడు ప్రాంతములలోను, తూర్పుగోదావరి జిల్లాలో ఏజెన్సీ ఏరియాలోయున్న అనేక పల్లెటూళ్లలోను సువార్తకూటములు, బైబిలు తరగతులు నిర్వహించిరి. దేవుడు నమ్మదగినవాడు అనే అంశముపై ఆయన బోధించిరి. సోదరులు వరద కృపారావు గారు ఈ పనిలో ఎంతగానో ఆయనకు సహకరించిరి.

2018 ఫిబ్రవరిలోనే అంతర్జాతీయ రోటరీ సంస్థ వారి డిస్ట్రిక్ట్–315కు రిక్కీ గూటం గారిని అసిస్టెంట్ గవర్నరుగా నియమించిరి. అందును బట్టి ఆయనకు గుంటూరు, కృష్ణా జిల్లాల నుండి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల వరకుయున్న రోటరీ సంస్థల యొక్క బాధ్యతను అప్పగించిరి. యిది భారతదేశంములో క్రీస్తుసంఘములకు దక్కిన అపార గౌరవము. రిక్కీ గారు 2018 జులై నుండి 2019 జూన్ వరకు ఆ పదవిలో కొనసాగుదురు. ఇటు సువార్తపని భారము అటు అంతర్జాతీయ సహాయసంస్థ భారమును రోటరీ ఆయన సమర్థవంతముగా నడుపగల్గునట్లు చదువరులు ప్రార్థించమనవి.

ఆంధ్ర తెలంగాణ క్రీస్తుసంఘ సువార్తికుల సదస్సు ఫిబ్రవరి 22వ తేదీన ఒంగోలులో నిర్వహించబడెను. ఆ సదస్సుకు 5–6 వందలమంది హాజరైనట్టు భోగట్టా. మరియు రిక్కీగూటం గారితో సహా పలువురు సోదరులు అక్కడ ఉపన్యసించిరి. ఆ సదస్సు తాలూకు సవిస్తర సమాచారము సత్యవాక్కుకు ఇంకా లభించనందున వివరములు తెలియజేయలేకున్నాము.

2018 ఫిబ్రవరి 24వ తేదీ శనివారం కాకినాడ సత్యవాణి – క్రీస్తుసంఘ ఆవరణములో నెలవారీ సువార్తికుల సదస్సు జరిగెను. హాజరయ్యేవారి సంఖ్యను పరిమితము చేస్తూ ఉభయగోదావరి జిల్లాలో యున్న సువార్తికులను మాత్రమే

ఆ సదస్సుకు ఆహ్వానించుట జరిగినది. అయినను 50-60 మంది సువార్తికులు హాజరుకాగా అందు టి. నతానియేలు (రాయవరం), రిక్కీగూటం, పాల్‌కృష్ణ, జాషువాగూటం గార్లును తదితర్లును వాక్యోపదేశము చేసిరి. యేసుక్రీస్తు యొక్క నిత్య దైవత్వమును గూర్చి యోహాను సువార్తను ఆధారము చేసికొని సోదరులు జాషువా గారు గంభీరముగా బోధించిరి. రిక్కీ గారు కూడ సువార్తికులకు సహాయపడు అనేక హెచ్చరికలనిస్తు వాక్యమును బోధించిరి. అందరు ఆయనను అభినందించిరి.

జూన్ నెలలో వేసవి సెలవులలో కాకినాడ సత్యవాణి-క్రీస్తు సంఘ ఆవరణలో యువతీ యువకులకు 3-4 వారముల మట్టుకు బైబిలు తరగతులు నిర్వహించబడును. భోజనం, వసతి ఉచితం. మీ సంఘములలో యున్న యువతీ యువకులను ప్రోత్సహించి కాకినాడ పంపవలెను అని రిక్కీ గూటం గారు తెలియజేయు చున్నారు.

RIN Regd. No. 69973/98
Postal Regd. No. AP/KD-02/2018-2020

From :
**SATYAVAKKU**
P.O. Box 80, Kakinada - 533001

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004